TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక




సంపుటి : 3 | సంచిక : 301 | మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper

## పీఎం కిసాన్ నిధులు విడుదల



**ఢిల్లీ** : అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించే ఆశయంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం-కిసాన్ నిధులు సోమవారం జమయ్యాయి. ఈ పథకం కింద 19వ విడత నిధులను నేడు ప్రధాని మోదీ విడుదల చేశారు. బిహార్‌లోని భాగల్‌పుర్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' కింద ఈ నిధులు విడుదల చేశారు. తాజాగా విడుదల చేసిన రూ.22వేల కోట్లతో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రైతులకు ఏటా ఒక్కో విడత రూ.2వేల చొప్పున మూడువిడతల్లో రూ.6వేల సాయం అందించే "పీఎం కిసాన్" పథకాన్ని కేంద్రం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించింది. ఇప్పటివరకు 11 కోట్లమంది రైతులకు 18 వాయిదాల్లో రూ.3.46లక్షల కోట్లు అందజేసింది.

## ఎవరి గెలుపుకోసం కేసీఆర్ కుటుంబం పనిచేస్తోంది?: రేవంత్‌రెడ్డి



**కరీంనగర్:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించేందుకు ఎవరి ఓటు వేయాలో భారాస అధినేత కేసీఆర్ చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎవరి గెలుపు కోసం కేసీఆర్ కుటుంబం పనిచేస్తుందో చెప్పాలన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రేవంత్ మాట్లాడారు. "భారాస, భాజపా చీకటి ఒప్పందంలో భాగంగానే కాంగ్రెస్‌ను ఓడించాలని చెబుతున్నారు. 11వేల టీచర్ ఉద్యోగాలు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? భారాస పాలనలో ప్రభుత్వ ఉద్యోగులు అప్పులు చేసే పరిస్థితి ఉండేది. 20వ తేదీ వరకు జీతాలు అడుక్కునే స్థాయికి ఉద్యోగులను కేసీఆర్ ప్రభుత్వం దిగజార్చింది"అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్




**దిల్లీ:** తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఏపీ, తెలంగాణలో ఐదుగురు చొప్పున మొత్తం 10 మంది పదవీకాలం ముగియనుంది. మార్చి 29 నాటికి ఏపీలో యనమల రామకృష్ణుడు, జంగా కృష్ణమూర్తి, పి.అశోక్‌బాబు, తిరుమల నాయుడు, దువ్వారపు రామారావు పదవీకాలం ముగియనుంది. తెలంగాణలో పదవీకాలం ముగిసే వారిలో మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హాసన్ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది.



# మహాశివరాత్రికి చివరి పవిత్ర స్నానం

**ప్రయాగ్‌రాజ్:** యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13న ప్రారంభమైన మహాకుంభమేళా ముగింపుదశకు చేరింది. మహాశివరాత్రి (ఫిబ్రవరి 26)తో ఈ మహోత్సవం ముగియనుంది. ఈ నేపథ్యంలో త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు జనం తండోపతండాలుగా తరలివస్తున్నారు. శివరాత్రి రోజున మహాకుంభమేళాలో చివరి పవిత్ర స్నానాలు జరగనుండటంతో అధికారులు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు.

మహాశివరాత్రి రోజున ఇక్కడికి తరలివస్తున్న భక్తులందరికీ పుణ్యస్నానాలు చేసే అవకాశం కల్పించే దిశగా అధికారులు పలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్‌కు చేరే అన్నిమార్గాల్లో ట్రాఫిక్‌జామ్ నెలకొంటోంది. దీనిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. మరోవైపు జనం పెద్ద సంఖ్యలో రైళ్లలో ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటు న్నారు.

మహా కుంభమేళా దృష్ట్యా ప్రతిరోజూ 80 నుండి 100 రైళ్లను రైల్వేశాఖ ప్రయాగ్‌రాజ్ మీదుగా నడుపుతోంది. ఇప్పుడు మహాశివరాత్రిని దృష్టిలో ఉంచుకుని, ఫిబ్రవరి 26న 200కి పైగా కుంభమేళా ప్రత్యేక రైళ్లను నడపడానికి రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రత్యేక రైళ్లలో 18 నుండి 20 కోచ్‌లు ఉంటాయి. అయితే, భక్తుల రద్దీ దృష్ట్యా 50కి పైగా సాధారణ రైళ్లను రద్దు చేశారు. మహా కుంభమేళా సమయంలో భక్తుల కోసం 14 వేలకు పైగా రైళ్లు నడుస్తున్నాయి. శనివారం వరకు 60 కోట్లకు పైగా భక్తులు మహా కుంభ స్నానం చేశారని డీఐజీ వైభవ్ కృష్ణ తెలిపారు. మహాశివరాత్రిని దృష్టిలో ఉంచుకుని మహాకుంభమేళా ప్రాంతంలో భారీగా పోలీసులను మోహరించారని, సంగమ ప్రాంతానికి వచ్చే భక్తులు సురక్షితంగా స్నానం చేసి, వారి గమ్యస్థానానికి చేరుకునేలా పర్యవేక్షించేందుకు పలువురు అధికారులు ప్రత్యేక విధులు నిర్వహిస్తు న్నారు. ట్రాఫిక్ సజావుగా సాగేందుకు వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు ఏ మార్గం నుండి వచ్చినా, దానికి సమీపంలోని పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారని వైభవ్ కృష్ణ తెలిపారు.

## బెంగళూరు- మంగళూరు మధ్య తగ్గనున్న ప్రయాణ దూరం



**తెలుగు న్యూస్ టైమ్స్ :**

కర్నాటక ప్రజలకు కేంద్రప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని రెండు మెగా నగరాలైన బెంగళూరు- మంగళూరు లను అనుసంధానిస్తూ త్వరలో ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మిస్తున్నట్లు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ నగరాలను హసన్ ప్రాంతం మీదుగా అనుసంధానిస్తామని తెలిపింది.ఈ ఎక్స్‌ప్రెస్‌వే ఈ రెండు నగరాల ప్రజలకు మరింత సౌకర్యాన్ని అందించడమే కాకుండా, ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఊతమిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంతో ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం ఏడు నుండి ఎనిమిది గంటలు వరకూ తగ్గే అవకాశం ఉందని, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును భారత జాతీయ రహదారుల అథారిటీ, కర్ణాటక ప్రజా పనుల శాఖ సంయుక్తంగా చేపట్టనున్నాయని తెలిపింది. ఈ ఎక్స్‌ప్రెస్‌వే ప్రధాన లక్ష్యం బెంగళూరు వెలుపలి ప్రాంతాలలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం. ఈ ఎక్స్‌ప్రెస్ వే 335 కి.మీ. దూరం ఉంటుంది, నాలుగు నుండి ఆరు లేన్‌లుగా దీనిని నిర్మించను న్నారు. ఈ బెంగళూరు- మంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం 2028లో ప్రారంభం కానుంది . ఇది రాష్ట్ర రవాణా రంగానికి గేమ్ ఛేంజర్‌గా మారనుందని అధికారు లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి చాలా సమయం పడుతోంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ మార్గంలో ప్రయాణించాలంటే పలు ఇబ్బందులు ఎదువుతుం టాయ. ఇటీవల కర్ణాటక ఉప ముఖ్య మంత్రి డికె శివకుమార్ మాట్లాడుతూ బెంగళూరు ట్రాఫిక్ రద్దీ సమస్యను రాబోయే రెండు,మూడు ఏళ్లలోపు పరిష్కరించడం అసాధ్యమని వ్యాఖ్యానించారు.

## మిర్చి రైతులకు కేంద్రం గుడ్ న్యూస్



**దిల్లీ:** ఏపీలో మిర్చి రైతులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఆయన రాసిన లేఖకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ శుభవార్త చెప్పింది. క్వింటా మిర్చికి రూ.11,781 ఇవ్వాలని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వం ఈ ధర ప్రకటించింది. 2.58లక్షల మెట్రిక్ టన్నుల మిర్చి సేకరణకు అవకాశం కల్పించింది. నెలపాటు ఈ ఉత్తర్వులు అమల్లో ఉండనున్నాయి. మిర్చి రైతుల ఇబ్బందులపై ఇటీవల సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయడంతో పాటు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తోనూ మాట్లాడారు. ఈ నేపథ్యంలో కేంద్రం మిర్చికి ధర ప్రకటించింది.

## అది సూపర్ ఫుడ్.. ఏడాదిలో 300 రోజులు తీసుకుంటా



**పట్నా:** మఖానా సూపర్ ఫుడ్ అని, అది ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకారి అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. 365 రోజుల్లో 300 రోజులు అది తన ఆహారంలో భాగమయ్యేలా చూసుకుంటానని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న చాలామంది ప్రజలకు అల్పాహారంలో మఖానా ఉంటుందని, అంతర్జాతీయ స్థాయిలో దాని ఉత్పత్తి ఉండాలని పేర్కొన్నారు. సోమవారం బిహార్‌లోని భాగల్‌పుర్‌లో పర్యటించిన సందర్భంగా.. తన ఆహారపు అలవాటు గురించి చెప్పారు.

రైతుల శ్రేయస్సు కోసం బిహార్‌లో మఖానా బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు వార్షిక బడ్జెట్‌లో నిర్మలాసీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 'మఖానా బోర్డు ఏర్పాటుకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నాం. ఈ బోర్డు ద్వారా ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపడతాయి. రైతులకు శిక్షణ అందుతుంది. వారు అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలనూ పొందేలా బోర్డు చూస్తుంది' అని మంత్రి వివరించారు. దీనికి గుర్తుగా భాగల్‌పుర్ కార్యక్రమంలో మోదీకి మఖానాతో చేసిన దండను వేసి గౌరవించారు.

**లాలూ వ్యాఖ్యలు.. మండిపడిన ప్రధాని**

దిల్లీ రైల్వే స్టేషన్ తొక్కిసలాట ఘటనపై బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా నిర్వహణలో ఐక్యత కనిపిస్తోంది. భారతదేశ అద్భుతమైన వారసత్వాన్ని కాపాడేందుకు, భవిష్యత్తు నిర్మాణం కోసం ఎన్డీయే ప్రభుత్వం అందరితో కలిసి పనిచేస్తోంది. ఆటవిక రాజ్యాన్ని ప్రోత్సహించే ఈ వ్యక్తులు మన వారసత్వాన్ని, విశ్వాసాలను ద్వేషిస్తున్నారు" అని బిహార్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ దుయ్యబట్టారు.

కుంభమేళాకు ప్రయాణికులు పోటెత్తడంతో ఇటీవల న్యూదిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. 14వ నంబరు ప్లాట్‌ఫాంపై ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ నిలిచి ఉండడంతో భక్తులు అక్కడకు చేరుకున్నారు. ఇతర రైళ్లు ఆలస్యం కావడంతో వాటి కోసం వచ్చిన ప్రయాణికులు అదే సమయంలో 12, 13, 14 నంబరు ప్లాట్‌ఫాంలపై ఉన్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడ రద్దీ పెరిగిపోయి తొక్కిసలాటకు దారితీసింది. ఈ ఘటనలో 18 మంది మరణించగా.. అనేక మంది గాయపడ్డారు.

దీనిపై లాలూ ప్రసాద్ యాదవ్ స్పందిస్తూ.. కుంభమేళా అర్థంలేనిదని వ్యాఖ్యలు చేశారు. ఇదంతా బుజ్జగింపు రాజకీయమని ఆ విమర్శలను భాజపా తిప్పికొట్టింది. తాజాగా పీఎం స్పందించారు. ఇక ఈ ఏడాది చివర్లో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో అక్కడి రాజకీయాలు వేడెక్కాయి.

## ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవికి జీవీ రెడ్డి రాజీనామా



**అమరావతి:** ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవికి జీవీ రెడ్డి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవితో పాటు తెదేపా ప్రాథమిక సభ్యత్వం, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పదవి నుంచి వైదొలుగుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు తెదేపా అధినేత, సీఎం చంద్రబాబుకు తన రాజీనామా లేఖను పంపించారు. "వ్యక్తిగత కారణాలతో తెదేపా ప్రాథమిక సభ్యత్వంతో పాటు పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవులకు రాజీనామా చేస్తున్నాను. మీరు నాపై ఉంచిన విశ్వాసం.. అందించిన మద్దతుతో పాటు కీలక బాధ్యతలు నిర్వహించేందుకు అవకాశం కల్పించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెదేపా మరింత బలంగా ఎదిగి ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షిస్తున్నాను. ఇకపై పూర్తిగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతాను. భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీలోనూ చేరే ఉద్దేశం లేదు" అని జీవీరెడ్డి పేర్కొన్నారు.

## దిల్లీ అసెంబ్లీ.. తొలిరోజే ఆప్ ఎమ్మెల్యేల నిరసన



**ఢిల్లీ :** దేశరాజధానిలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక నేడు (సోమవారం) తొలిసారి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించారు. కాగా ప్రతిపక్ష ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు మొదటి రోజే సభలో భారీ ఎత్తున నిరసనలు చేపట్టారు. సీఎం కార్యాలయం నుంచి బీఆర్ అంబేడ్కర్, భగత్ సింగ్‌ల ఫొటోలు తొలగించారని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఆతిశీ ఆరోపించారు. భాజపా దళిత వ్యతిరేక పార్టీ అని మరోసారి రుజువైందని ఆమె అన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో బాబా సాహెబ్ అంబేద్కర్, భగత్ సింగ్‌ల ఫొటోలు ఏర్పాటు చేశారని అన్నారు. భాజపా అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం ఆఫీస్ నుంచి వారి ఫొటోలను తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ..నిరసన చేపట్టారు.

అసెంబ్లీ సమావేశానికి ముందు ఆప్ నేతలు అసెంబ్లీ వెలుపల ఆందోళనకు దిగారు. భాజపా ప్రభుత్వం తమ మొదటి క్యాబినెట్ సమావేశంలోపు ప్రతి మహిళ ఖాతాలో రూ.2,500 వేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని ఆప్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. మార్చి 8 నాటికి దిల్లీలోని ప్రతి మహిళ ఖాతాలో మహిళా సమ్మాన్ యోజన మొదటి విడత డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. గత రెండ్రోజులుగా సీఎంను కలవడానికి తమకు సమయం కూడా ఇవ్వట్లేదని అన్నారు.

ప్రతిపక్షాలు చేపడుతున్న నిరసనలపై తాజాగా దిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన భాజపా ఎమ్మెల్యే విజేందర్ గుప్తా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతలకు సభ సజావుగా నడవడం ఇష్టం లేదని, సభకు అంతరాయం కలిగించాలనే ఉద్దేశంతో వారు ఇక్కడికి వచ్చారని వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలను రాజకీయం చేయొద్దని ఆప్ నేతలను వారించారు. ఈ గందరగోళం మధ్య సభా కార్యక్రమాలు 15 నిమిషాల పాటు వాయిదా పడ్డాయి.

# భూగోళంపై భానుడి భగభగలు!

**అమరావతి:** భానుడి ప్రకోపానికి భూగోళం భగభగమండు తోంది. పెరుగుతున్న కాలుష్యం మానవాళిని ముప్పు ముంగిటకు నెట్టేస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో వేసవి కాలం మొదలైంది. ఈ ఏడాది కూడా భానుడి భగభగలు తప్పవని ప్రపంచ ఉష్ణోగ్రతల డేటా ప్రొవైడర్ కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ (సీ3ఎస్) వెల్లడించింది. పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

భూతాపం భారీగా పెరిగిందని ప్రకటించింది. అదేవిధంగా 2050 నాటికి ప్రీ ఇండస్ట్రియల్ లెవల్ ఉష్ణోగ్రతలు 2 డిగ్రీలకు చేరుకునే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇప్పటికైనా మేలుకొని కర్బన ఉద్గారాల నియంత్రణకు ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా అడుగులు వెయ్యకపోతే ఉష్ణతాపాన్ని తట్టు కోవడం కష్టమని సీ3ఎస్ హెచ్చరించింది. 1850 నుంచి ఉష్ణోగ్రతల గణాంకాలు తీసుకుంటే... 2024ను అతి దుర్భరమైన (గ్లోబల్ వార్మింగ్) సంవత్సరంగా ప్రకటించింది.

**సముద్రాలు సైతం వేడెక్కుతున్నాయ్! :** కేవలం భూతాపమే కాదు... సముద్రాలు సైతం వేడెక్కుతున్నాయని సీ3ఎస్ హెచ్చరించింది. అంటార్కిటికా, ఆస్ట్రేలియా మినహా అన్ని ఖండాంతర ప్రాంతాలు, సముద్రంలోని గణనీయమైన భాగాలు, ముఖ్యంగా ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రం, హిందూ మహాసముద్రం, పశ్చిమ పసిఫిక్ మహాసముద్రాల ఉపరితల ఉష్ణోగ్రతలు కూడా 2024లో రికార్డు స్థాయిలో నమోదయ్యాయి.

2024లో ధ్రువ సముద్రంపై వార్షిక సగటు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత(ఎస్ఎస్‌టీ) రికార్డు స్థాయిలో 20.87 డిగ్రీలకు చేరుకుంది. ఇది 1991-2020 సగటు కంటే 0.51 డిగ్రీలు ఎక్కువగా ఉండటం గమనార్హం.

**2025 మరో వేడి సంవత్సరం కాబోతోందా.? :** ఈ ఏడాది కూడా 2024 మాదిరిగానే భానుడి భగభగలతో మండిపోయే సూచనలు ఆదిలోనే స్పష్టంగా కనిపించాయని సీ3ఎస్ వెల్లడించింది. జనవరి నెలాఖరు నుంచే వేసవిని తలపించేలా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2 నుంచి 4 డిగ్రీలు గరిష్ఠంగా నమోదవుతుండటమే ఇందుకు సంకేతమని వెల్లడించింది.

గత ఏడాది జనవరి నుంచి ఫిబ్రవరి మధ్యలో సాధారణం కంటే 0.37 డిగ్రీలు పెరగగా.. ఈ ఏడాది జనవరిలోనే సగటు ఉష్ణోగ్రత 0.94 డిగ్రీలు పెరగడం అసాధారణ హెచ్చరికగా పరిశోధకులు భావిస్తున్నారు. 2015-24 మధ్య కాలంలో సాధారణం కంటే 0.3 డిగ్రీలు ఉష్ణోగ్రతలు పెరిగి అత్యంత వేడి దశాబ్దంగా నమోదైందని.. ఉష్ణోగ్రత సగటు ఒక్కో డిగ్రీ పెరిగే కొద్దీ.. వడదెబ్బ మరణాల సంఖ్య 5 శాతం పెరిగే ప్రమాదం ఉందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

**సీ3ఎస్ ఏం చెప్పిందంటే..**

- 1850 నుంచి భూ ఉపరితల ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే 2024 అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు పొందింది.
- సీ3ఎస్ పరిశోధనల ప్రకారం ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 15.10 డిగ్రీల సెల్సియస్.
- 1991-2020 మధ్య సగటు 0.72 డిగ్రీల సెల్సియస్ కాగా, అది 2024లో 1.5 డిగ్రీలు అధికంగా నమోదైంది.
- గత 10 సంవత్సరాల ఉష్ణోగ్రతలను పరిగణనలోకి తీసుకుంటే 2024 అత్యంత గరిష్ఠ ఉష్ణోగ్రతల సంవత్సరం.
- 2024 జూలై 24న రోజువారీ ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 17.16 డిగ్రీలు నమోదైంది. ఇదే ఇప్పటి వరకు చరిత్రలో అత్యంత ఉష్ణతాపం రోజుగా సీ3ఎస్ ప్రకటించింది.
- 2024లో వాతావరణంలో నీటి ఆవిరి మొత్తం కూడా రికార్డు స్థాయికి చేరుకుంది. 1991-2020 సగటు కంటే దాదాపు 5శాతం ఎక్కువగా వ్యాపించింది.

**ఎందుకిలా జరుగుతోంది? :** శీతోష్ణస్థితి మార్పులు భయపెడుతున్నాయి. ఈ శతాబ్దం చివరి నాటికి ప్రపంచవ్యాప్త ఉష్ణోగ్రతలు 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి హెచ్చరిస్తోంది. దీనికి కారణం మానవ తప్పిదాలేనన్నది స్పష్టమవుతోంది. పెరుగుతున్న కాలుష్యం కారణంగా వాతావరణంలోకి కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్... మొదలైన వాయువుల కారణంగా గ్లోబల్ వార్మింగ్ ప్రమాదంముంచుకొస్తోంది.

గత ఏడాది భూమి వేడెక్కడానికి కారణమైన సీవో2 వంటి వాయు ఉద్గారాలు ఇప్పటికీ వాతావరణంలో రికార్డు స్థాయిలోనే ఉన్నాయని సీ3ఎస్ వెల్లడించింది. కర్బన ఉద్గారాలు అధికంగా విడుదల చేస్తున్న దేశాల జాబితాలో 29.18 శాతంతో చైనా అగ్రస్థానంలో ఉండగా.. అమెరికా (14.02 శాతం), భారత్ (7.09శాతం), రష్యా (4.65శాతం) ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. వాతావరణంలోని గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రతలే మన వాతావరణాన్ని ప్రభావితం చేసే అతిపెద్ద అంశమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## కోనసీమ కొబ్బరికి కానరాని శివరాత్రి కళ



కొబ్బరికాయల ధరలు తగ్గిపోవడంతో రైతులు డీలా పడిపోయారు. కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో గత నెలలో వెయ్యి కొబ్బరికాయలు రూ.15వేల నుంచి 16 వేల వరకు ధర పలికాయి. పండగల సమయం కావడంతో పాటు పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో దిగుబడులు తగ్గడంతో ధరలు ఆశాజనకంగా కనిపించాయి. మహా శివరాత్రి పర్వదినం నాటికి (ఫిబ్రవరి నెలలో) మరింత ధరలు పెరుగుతాయని ఆశించారు. ఈ మేరకు వ్యాపారులు పెద్దఎత్తున నిల్వ కూడా చేసుకున్నారు. అయితే ధరలు నిరాశ పరుస్తున్నాయి. కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో ఈ ఏడాది మహా శివరాత్రికి పొరుగు రాష్ట్రాల నుంచి స్థానిక వ్యాపారులకు పెద్దగా ఆర్డర్లు రాలేదు. దీంతో తమ ఆశలు అడియాసలు అయ్యాయని రైతులు వాపోతున్నారు. ప్రాంతీయ మార్కెట్‌లో ప్రస్తుతం వెయ్యి కాయల ధర రూ.14 వేల వరకూ పలుకుతోంది. అంటే రూ.2,000 వరకూ ధర తగ్గడంతో కర్షకులు, వర్తకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఒబెసిటీపై పోరాటం.. 10 మందిని నామినేట్ చేసిన మోదీ

**ఢిల్లీ:** దేశంలో ఊబకాయం తీవ్ర సమస్యగా మారుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. దీన్ని అధిగమించడానికి చర్యలు చేపట్టాలని ఆదివారం జరిగిన మన్‌కీ బాత్ వేదికగా పిలుపునిచ్చారు. తాజాగా దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 10 మంది ప్రముఖులను ఆయన నామినేట్ చేశారు. వీరిలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తదితరులు ఉన్నారు. "నిన్నటి మన్ కీ బాత్‌లో చెప్పినట్లుగా.. ఊబకాయానికి వ్యతిరేకంగా మన పోరాటాన్ని బలోపేతం చేయడంతో పాటు.. తినే ఆహారంలో వంటనూనె వినియోగాన్ని తగ్గించడంపై అవగాహన కల్పించేందుకు వీరిని నామినేట్ చేస్తున్నా. ఈ ఉద్యమం మరింత విస్తరించేలా వీరంతా ఒక్కొక్కరూ 10 మంది చొప్పున వ్యక్తులను నామినేట్ చేయాలని కోరుతున్నా" అని మోదీ రాసుకొచ్చారు. ఆనంద్ మహీంద్రా, ఒమర్ అబ్దుల్లాతో పాటు, నటుడు దినేశ్‌లాల్ యాదవ్ అలియాస్ నిరాహువా, యువ షూటర్ మను బాకర్, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను, ప్రముఖ నటులు మోహన్‌లాల్, మాధవన్, గాయని శ్రేయా ఘోషల్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, రాజ్యసభ ఎంపీ సుధామూర్తిని ప్రధాని నామినేట్ చేశారు. ఒబెసిటీ సమస్య గురించి ప్రధాని మోదీ ఆదివారం మన్ కీ బాత్‌లో ప్రస్తావించారు. "2022లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన గణాంకాల ప్రకారం.. ప్రపంచ వ్యాప్తంగా 250 కోట్ల మంది అధిక బరువుతో బాధపడుతున్నారు. ప్రతి ఎనిమిది మందిలో ఒకరు ఊబకాయం సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇది చాలా ఆందోళనకర అంశం. ఊబకాయం అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. దీన్ని అధిగమించేందుకు మనమంతా కృషి చేయాలి. అది మన బాధ్యత కూడా..! తినే ఆహారంలో వంటనూనె వాడకాన్ని కనీసం పది శాతం మేర తగ్గించుకోవాలి" అని ప్రధాని పిలుపునిచ్చారు.

# రాష్ట్ర వ్యాప్తంగా డిస్పెన్సరీలు ప్రారంభం



**విల్లివాకం న్యూస్:** తమిళనాడు అంతటా ఏర్పాటు చేసిన 1,000 ముఖ్యమంత్రి డిస్పెన్సరీలను ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ చెన్నైలోని కొట్టూరుపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీలో జరిగిన కార్యక్రమంలో వీడియో ప్రదర్శన ద్వారా ప్రారంభించారు. ఆ తర్వాత చెన్నై పాండి బజార్‌లో సహకార సంఘం ఏర్పాటు చేసిన దవాఖానను సందర్శించారు. తమిళనాడులోని మొత్తం 38 జిల్లాల్లో సీఎం డిస్పెన్సరీలు ప్రారంభించబడ్డాయి. అనంతరం జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మాట్లాడుతూ.. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రాగానే కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు పలు చర్యలు తీసుకున్నాం. రెండు డోసుల వ్యాక్సిన్ మరియు బూస్టర్ వ్యాక్సిన్ ఇవ్వడం ద్వారా ప్రజలను రక్షించాము. ఇది ప్రాణాలను రక్షించే పని. విద్య, వైద్యం ద్రవిడ మోడల్ ప్రభుత్వానికి రెండు కళ్లు. మెరుగైన వైద్య మౌలిక సదుపాయాల కల్పనకు, నాణ్యమైన వైద్యం అందించేందుకు వివిధ పథకాలను అమలు చేస్తున్నాం. ప్రజలకు తక్కువ ధరకే మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాము. మన ప్రభుత్వం సామాన్యుల ప్రభుత్వం అనడానికి ఈ ప్రాజెక్టు నిదర్శనం. మధుమేహం సహా వ్యాధులకు మందులు తక్కువ ధరకే లభిస్తాయన్నారు.

## ఘనంగా 18వ రాష్ట్ర స్థాయి పోటీలు



**విల్లివాకం న్యూస్:** సేపా అకాడమీ మరియు సేపా ట్రస్ట్ తరపున 18వ రాష్ట్ర స్థాయి కర్రసాము, కరాటే మరియు యోగా పోటీలు తిరునింద్రవూరు జయ కళాశాలలో జరిగాయి. మురుగకణి, ఎం. రాజా వీటిని ప్రారంభించారు. విజేతలైన విద్యార్థుల కోసం ఫిల్మ్ మేకర్ అశోక్ జి. లోధా, నటీమణులు. నమిత, సుహాసినిలు ప్రైజ్ షీల్డ్, సర్టిఫికెట్ అందజేశారు. అకాడమీ అధ్యక్షుడు. డా.ఎస్. రాజా, టోర్నమెంట్ కో-ఆర్డినేటర్ ఆర్. సంగీత పోటీలను నిర్వహించారు.

# బాణసంచా మృతుల కుటుంబాలకు సీఎం సాయం



**విల్లివాకం న్యూస్:** ధర్మపురి జిల్లా వేధారం పట్టిలో ప్రైవేట్‌కు చెందిన బాణసంచా ఫ్యాక్టరీ నడుస్తోంది. సోమవారం ఈ బాణాసంచా ఫ్యాక్టరీలో అనుకోకుండా పటాకులు పేలడం మొదలైంది. ఈ పేలుడు ధాటికి పక్కనే ఉంచిన పటాకులకు మంటలు వ్యాపించి పెద్ద శబ్దంతో పేలాయి. ఈ ఘటనలో అక్కడ పనిచేస్తున్న ముగ్గురు మహిళలు పేలుడు ధాటికి సజీవదహనమయ్యారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. ఈ సందర్భంగా ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఒక్కొక్కరికి రూ.4 లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించారు.

## చేతిరాత పోటీల్లో రాష్ట్రస్థాయి బహుమతులు గెలుచుకున్న వాసవ్య విద్యాలయం విద్యార్థులు



**గోదావరిఖని, న్యూస్ :** అక్షర హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చేతిరాత పోటీల్లో గోదావరిఖనికి చెందిన వాసవ్య విద్యాలయం విద్యార్థులు 9మంది రాష్ట్రస్థాయి బహుమతులను అందుకున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విభాగంలో ప్రథమ ద్వితీయ బహుమతులను ఆదివారం హైదరాబాదులో నిర్వహించిన ప్రత్యేక కార్య క్రమంలో అతిథుల చేతుల మీదుగా అందుకున్నారు. చేతిరాతలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి బహుమతులను అందుకున్న విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ బండి విక్రమ్ వర్మ,, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు, అభినందిస్తున్నారు.

## ధర్మపురిలోని బాణసంచా గిడ్డంగిలో పేలుడు



**అన్నానగర్ న్యూస్:** ధర్మపురి జిల్లా కంబైనల్లూరు సమీపంలో మురుక్కంపట్టి ప్రాంతంలోని ఒక ప్రైవేట్ టపాకాయల గిడ్డంగిలో పేలుడు సంభవించింది.ఒక టపాకాయల గిడ్డంగి పేలి ముగ్గురు వ్యక్తులు శరీర భాగాలు ఛిద్రమై మరణించారు.ఈ ప్రమాదంలో మంటలు వేగంగా వ్యాపించాయి, దీని ఫలితంగా బాణసంచా గోదాము పూర్తిగా పేలిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ టీం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమించింది.ఈ సంఘటన ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది.

# జయలలితకు నటుడు రజనీకాంత్ నివాళులు



**విల్లివాకం న్యూస్:** దివంగత జయలలితకు నటుడు రజనీకాంత్ సోమవారం నివాళులర్పించారు. చెన్నై పోయెస్ గార్డెన్‌లోని జయలలిత నివాసానికి చేరుకున్న నటుడు రజనీకాంత్ జయలలిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయలలిత మేనకోడలు దీప, ఏఐఏడీఎంకే మాజీ కార్యనిర్వాహక అధికారి పుగలేంది హాజరయ్యారు. అంతకుముందు వేద ఇల్లంకు వచ్చిన నటుడు రజనీకాంత్‌కు జె.దీపా శాలువా కప్పి స్వాగతం పలికారు. వేద ఇల్లంలో జయలలిత చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం నటుడు రజనీకాంత్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో 3 సార్లు వేదా హౌస్‌కి వెళ్లి జయలలితను కలిశాను. వేద హౌస్ కు 4వ సారి వస్తున్నా. మధురమైన.. కమ్మని జ్ఞాపకాలతో వెళతాను. మాజీ ముఖ్యమంత్రి జయలలిత గతించినా ప్రజల గుండెల్లో ఆమె జ్ఞాపకం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. జయలలిత నివాసం ఉండే వేద ఇల్లంలో జె. దీప నిర్వహించిన జన్మదిన వేడుకల్లో నటుడు రజనీకాంత్ పాల్గొన్నారు.

# గ్లెనీగల్స్‌లో విజయవంతంగా హెపటెక్టమీ శస్త్రచికిత్స



**విల్లివాకం న్యూస్:** చెన్నైలోని గ్లెనీగల్స్ హాస్పిటల్‌లో లివర్ సిర్రోసిస్‌తో బాధపడుతున్న 53 ఏళ్ల రోగికి విజయవంతంగా లాపరోస్కోపిక్ లివింగ్ డోనర్ హెపటెక్టమీ శస్త్రచికిత్స జరిగింది. ప్రాణాలను కాపాడేందుకు శస్త్రచికిత్సలో తన కుమార్తె తన తండ్రికి 50 శాతం కాలేయాన్ని దానం చేసింది. డాక్టర్ వివేక్ విజ్, డాక్టర్ జాయ్ వర్గీస్ మరియు డాక్టర్ సెల్వకుమార్ మల్లేశ్వరన్ నేతృత్వంలోని నిపుణుల బృందం లాపరోస్కోపిక్ లివింగ్ డోనర్ హెపటెక్టమీ ప్రక్రియను నిర్వహించడానికి 8 గంటలు పట్టింది. రోగి, కన్నన్ కామెర్లు మరియు కడుపులో ద్రవం పేరుకుపోవడం వల్ల పొత్తికడుపు వాపుతో బాధపడుతున్నారు మరియు జనవరి 2025లో చెన్నైలోని గ్లెనీగల్స్ హాస్పిటల్‌కు రిఫర్ చేయబడ్డారు. అక్కడికి చేరుకున్న వైద్యులు రోగి పరిస్థితిని పరీక్షించారు. కాలేయ మార్పిడి మాత్రమే అతని ప్రాణాలు నిలబెట్టగలదని భావించారు. 2025 ఫిబ్రవరి 10న కాలేయ మార్పిడి విజయవంతంగా జరిగింది. ఈ లాపరోస్కోపిక్ లివింగ్ డోనర్ హెపటెక్టమీ విజయం మా వైద్య బృందం యొక్క నైపుణ్యానికి మరియు మా ఆసుపత్రి యొక్క అత్యాధునిక శస్త్రచికిత్స సామర్థ్యాలకు నిదర్శనమని లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీ హెడ్ డాక్టర్ వివేక్ విజ్ అన్నారు. గ్లెనీగల్స్ హాస్పిటల్ హెపటాలజీ డైరెక్టర్ డాక్టర్ జాయ్ వర్గీస్ మాట్లాడుతూ, దాత చిన్న వయస్సు కారణంగా మేము రోగిపై మినిమల్లీ ఇన్వాసివ్ విధానాలను చేయాలని ఎంచుకున్నాము, ఇది శస్త్రచికిత్స తర్వాత నొప్పి, ఆసుపత్రిలో ఉండే సమయం మరియు దాతల కోలుకునే సమయాన్ని బాగా తగ్గిస్తుంది. ఈ అత్యాధునిక పద్ధతులు శస్త్రచికిత్స గాయాన్ని తగ్గిస్తాయి, దీని ఫలితంగా తక్కువ సమస్యలు, రోజువారీ కార్యకలాపాలకు త్వరగా తిరిగిరాగల రన్నారు.

# అనేక తప్పులను కప్పిపుచ్చుకునేందుకు డీఎంకే కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తోందన్నారు. - పొన్. రాధాకృష్ణన్



**అన్నానగర్ న్యూస్:** తమిళనాడుకు, కేంద్ర బడ్జెట్ కు మధ్య సన్నిహిత సంబంధం ఉంది. భారతదేశంలో మొట్టమొదటి బడ్జెట్‌ను తమిళనాడుకు చెందిన వ్యక్తి రూపొందించారు. మోడీ ప్రభుత్వం పేదలు మరియు అణగారిన వర్గాల ప్రభుత్వం. ఇది పేద మరియు సామాన్య ప్రజల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను పెంచే ప్రభుత్వం.ప్రజల దగ్గర డబ్బు లేకపోతే దానికి కారణం గత కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రపంచంలోని ఏ దేశంలోనూ డిపాజిట్ లేకుండా మీరు బ్యాంకు ఖాతాను తెరవలేరు. కానీ మోడీ పాలనలో డబ్బు లేని పేద, సామాన్య ప్రజలు బ్యాంకుల్లో ఖాతాలు తెరిచే సౌకర్యం కల్పించారు. ఒక వారంలో 1.8 లక్షల కోట్ల బ్యాంకు ఖాతాలను తెరిచి భారతదేశం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. దీని ద్వారా బ్యాంకు ఖాతాలో రూ.2.50 వేల కోట్లు జమ అయ్యాయి.తమిళనాడు ప్రభుత్వం తమిళనాడులోని చాలా చోట్ల రోడ్లు నిర్మించడానికి చొరవ తీసుకోకపోవడం, వాటిని కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వకపోవడం వల్ల అనేక ప్రాజెక్టులు నిలిచిపోయాయి. తమిళనాడు ప్రభుత్వం చేసిన అనేక తప్పులను కప్పిపుచ్చడానికి మరియు దాని నుండి తప్పించుకోవడానికి వారు కేంద్ర ప్రభుత్వాన్ని సాకుగా ఉపయోగిస్తున్నారు. తమిళనాడుకు ఎన్నో మంచి ప్రాజెక్టులు ఇచ్చిన మోడీని రావద్దని డీఎంకే చెప్పాలనుకుంటోంది. ప్రభుత్వానికి అర్హత లేదు. నేడు, డిఎంకెలోని మంత్రుల నుండి కౌన్సిలర్ల వరకు అందరూ సిబిఎస్ఇ పాఠశాలలను ప్రారంభించి అక్కడి విద్యార్థులకు హిందీ బోధిస్తున్నారు. డీఎంకే పాలనలో ప్రైవేట్ పాఠశాలల ప్రవాహం కారణంగా తమిళనాడులో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గింది. చాలా ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 4 మంది విద్యార్థులు మాత్రమే చదువుతు న్నారు. 2026లో తమిళనాడులో అవినీతి రహిత ప్రభుత్వాన్ని బిజెపి ఏర్పాటు చేస్తుంది. మేము అధికారంలోకి రావాలనుకుంటున్నాము. నా జీవితంలో నేను ఒక్క పైసా కూడా లంచం తీసుకోలేదన్నారు.

# హృదయపూర్వకంగా రాష్ట్ర హెూదా కోసం సవాలు చేయడం పిరికితనమా? - అన్బుమణి ప్రసంగానికి శేఖర్ బాబు స్పందన



**గిండి న్యూస్:** కుల ఆధారిత జనాభా గణన నిర్వహించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదని ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ అబద్ధాలు చెబుతున్నారని, దీనిని పిరికితనంగా అభివర్ణించారని అన్బుమణి రామదాస్ విమర్శించారు.ఈ పరిస్థితిలో, చెన్నైలో ఒక కార్యక్రమానికి హాజరైన మంత్రి శేఖర్‌బాబును విలేకరులు దీని గురించి ప్రశ్నించారు. దీనికి శేఖర్ బాబు స్పందిస్తూ..... కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు ఇవ్వాల్సిన అన్ని హక్కులను నిలిపివేసి, తమిళనాడు అభివృద్ధిని మందగిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వాన్ని గర్వంగా సవాలు చేసే ముఖ్యమంత్రిని పిరికివాడు అని పిలిచే వారు, పిరికివాడు అనే పదానికి అర్థం తెలియని వ్యక్తులు మాత్రమే అవుతారు. ఏదేమైనా, భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ప్రశంసించారు. మన ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర హక్కుల కోసం మాట్లాడగల ఉక్కు మనిషి కాగల ముఖ్య మంత్రి అని నేను అన్బుమణి రామదాస్‌కు తెలియజేయాలనుకుంటున్నానని పేర్కొన్నారు.







# నాగలాపురం టి.ఆర్.ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**నాగలాపురం న్యూస్:** నాగలాపురం టి.ఆర్.ఆర్ కళ్యాణ మండపంలో 2004-2006 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి శ్రీలత మేడం గారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత గారు అధ్యక్షత వహిస్తూ, ఇలాంటి విస్తృత కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన పూర్వ విద్యార్థుల గురుభక్తి, వినయ విధేయతలకు ఎంతో మద్దతు అందించారు. కళా శాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహాయ సహకా రాలు, అండదండలు ఎంత అవసరమో సభా ముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని వారు వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగలాపురం జూనియర్ కళాశాల పూర్వ అధ్యక్షుడు గౌల్ టి.రామచంద్రన్ ఉపన్యాసిస్తూ, విద్యార్థుల అంకితభావానికి సంతోషించి, వారి మార్గ దర్శకత్వంలో జీవిస్తున్నందు కు ఆనందాన్ని వ్యక్తం చేశారు. జీవితం అంటే బ్రతకడం కాదు, నిజమైన జీవనమనేది అని, విద్యార్థులు ఆదర్శప్రాయంగా ఉన్నారని పేర్కొన్నారు. అపూర్వ విద్యార్థుల జీవన సరళికి ఉపయుక్తమైన పలు అంశాలను ప్రస్తావిస్తూ, విద్యార్థులు నైతికతతో, ఆదర్శప్రాయం గా ఉన్నత శిఖరాలను అధిరోహించి, సమాజ పురోగతికి తోడ్పడే కార్యక్రమాలను చేపట్టాలని కోరుకున్నారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న బోటనీ లెక్చరర్ చంద్రశేఖర్ సార్ మాట్లాడుతూ, గురువు ఎక్కడ ఉన్నా గౌరవింపబడుతాడు. అందుకే మంచి శిష్యులు ఉండటం ఎంతో ముఖ్యంబీ ఇలాగే మా విద్యార్థులే లక్ష్యప్రాయమని చెప్పారు. తమ శిష్య లు ఉన్నత స్థాయిలో ఉన్నందుకు గర్వపడుతున్నా మని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న సివిక్స్ లెక్చరర్ గౌల్ పి. వడివేల్ గారు, విద్యార్థుల ఆత్మీయతకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇంకా, తమ శిష్యులు ఉన్నత పదవులను అలంకరించి, కళాశాల మాత్రమే కాకుండా రాష్ట్రం, దేశం గర్వించేలా జీవించాలని మార్గదర్శకం




సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తాము పూర్వజన్మ సుకృతం అన్న భావనను కలిగించిందని తెలిపారు. రెండు దశాబ్దాల తరువాత కూడా విద్యార్థులు తమ గురుభక్తిని మరువరాదు.

గౌరవ అతిథిగా వృత్తి విద్యా అధ్యాపకుడు గౌల్ జి. దేవేంద్ర గారు విద్యార్థుల ఆప్యాయతకు సభాముఖంగా ధన్యవాదాలు తెలుపుతూ, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఎం. మునిరత్నం కూడా విద్యార్థులందరినీ పేరుపేరునా పలకరించారు. "ఈ కళాశాల నా జీవితంలో మరువలేని గుర్తుగా నిలిచింది. రెండు దశాబ్దాల తరువాత కూడా నా శిష్యబృందాన్ని మరచిపోకుండా, ఇంతటి కార్య క్రమాన్ని నిర్వహించినందుకు విద్యార్థులందరికి అభినందనలు" అని అభిప్రాయపడ్డారు. తదుపరి, ఉపాధ్యాయ పదవికి అందించే గౌరవం, తల్లి దండ్రులు పిల్లల పట్ల సున్నితంగా వ్యవహరించా ల్సిన అవసరం, బిడ్డలకు నైతిక విలువలు నేర్పాల్సిన బాధ్యత, ఆధ్యాత్మిక చింతన కలిగించాల్సిన అవసరం గురించి విశదీకరించారు. ఈ కళాశాలతో తనకున్న అవినాభావ సంబంధాన్ని సభాముఖంగా పంచుకున్నారు. విద్యార్థుల పలకరింపులు, వారి ఆత్మీయతలు, అనురాగాలు ఆయన జీవితంలో మరువలేనివని, ఉపాధ్యాయ బృందాన్ని కొనియా డుతూ,




కళాశాల ప్రిన్సిపాల్ గారి అభివృద్ధి కార్యక్రమాలు రాబోవు తరాలకు ఆదర్శమని తెలిపారు. గౌరవ అతిథిగా మ్యాథ్స్ అధ్యాపకురాలు గౌల్ రేఖా ప్రదీప్ రెడ్డి, ఎకనామిక్స్ అధ్యాపకురాలు గౌల్ సి. సుజాతా మరియు ఆత్మీయ అతిథిగా పాల్గొన్న గౌల్ ప్రతాప్ గారు, విద్యార్థుల ప్రేమ, అనురాగాలు తమ జీవితంలో మధుర జ్ఞాపకాలు అవుతాయని, విద్యార్థుల ఉన్నతికి ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యాన్ని కలిగి, పూర్వ విద్యార్థుల బృందం, గురువులకున్న భక్తిని గజపుష్ప మాలు, సాలువులు, జ్ఞాపికలు ద్వారా సత్కరించి, హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు, రథసారథులుగా ఉండి నడిపించిన మణికంఠ, నరేష్, బాలాజీ సుబ్రహ్మణ్యం, దిలీప్, గురుమూర్తి తదితరులు, వారి సహకారానికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కొంత మంది ఉపాధ్యాయులు అనివార్య కారణాల వలన కార్య క్రమంలో పాల్గొనలేక పోయినా, తమ ఆశీర్వచనాలు విద్యార్థులందరికీ ఉంటాయని సందేశం పంపారు. కార్యక్రమం తెలుగుతల్లి ప్రార్థన, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమై, సాంస్కృతిక కార్యక్రమంతో అలరించి, వందన సమర్పణ, ఉప్పొంగి, జాతీయ గీతంతో ముగిసింది










## మహాకుంభమేల మహాయాత్ర

**జ్యోతి నగర్ , న్యూస్ :** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో ఎన్ టి పి సి నుండి అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ సభ్యుడు జనగామ తిరుపతి, శ్రీ వెంకటేశ్వస్వామి దేవాలయం నుండి ప్రధాన అర్చకులు శ్రీమాన్ శ్రీవాణమామలై రామాచార్యులు, పూజారి డింగరి జయేంద్ర సరస్వతి, భక్తులు సూదం వినయ్ కుమార్ గుప్త పాల్గొని పుణ్య స్నానాలు ఆచరించారు. సనాతన ధర్మాన్ని పాటిస్తూ హిందూ





ధర్మాన్ని రక్షిస్తు హరహర మహాదేవ శంభో శంకర అంటూ గంగా, యమున, సరస్వతి నదుల కలయిక అయినా త్రివేణి సంగమ నదులను ఆరాదిస్తూ పవిత్ర స్నానాలు భక్తి శ్రద్ధ లతో ఆచరించారు. మహా సంకల్పంతో పిత్రుదేవతలకు తిలా తర్పనాలు, పిండప్రదానాలు నిర్వహించి గంగా దేవికి హారతులు సమర్పించారు. కుంభమేళకు వచ్చిన నాగసాదువుల దగ్గర ఆశీర్వాదాం పొందారు. మహా కుంబమేళా లో ముక్కోటి దేవతలు అందరు కూడా ఏదో ఒక రూపంలో వచ్చి ఈ 48 రోజులు పవిత్ర త్రివేణి సంగమంలో ఉండి ప్రజలని ఆశీర్వ దిస్తారని అన్నారు. మహాకుంభ మేళాలో పవిత్రమైన పుణ్యస్నానం చేయడమే కాకుండ శక్తి సామర్థ్యాలకు మేరకు దానధర్మాలు కూడా చేయాలి అని ఇక్కడి సాదువులు సూచించారు అని అన్నారు.

## నామ్ తమిళర్ పార్టీ నుండి కాళీఅమ్మాళ్ నిష్క్రమణ

**గిండి న్యూస్:** మహిళా శిబిరం రాష్ట్ర సమన్వయకర్త కాళియమ్మాళ్ నామ్ తమిళర్ పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు.కాలపు పరిస్థితుల దృష్ట్యా తాను నామ్ తమిళర్ పార్టీని విడిచిపెడుతున్నట్లు కాలియమ్మాళ్ ఒక ప్రకటన విడుదల చేశారు. దీనికి సంబంధించి ఆమె విడుదల చేసిన ప్రకటనలో.... నేను ఇంతకు ముందు ఎన్నడూ లేనంత బరువైన హృదయంతో వ్రాస్తున్నాను. నేను పార్టీలో గడిపిన ప్రతి క్షణంలోనూ, నా కుటుంబం కంటే పార్టీని ఎక్కువగా ప్రేమించాను.ఈ 6 సంవత్సరాల ప్రయాణం నాకు చాలా రాజకీయ అనుభవాలను ఇచ్చింది. మనందరికీ ఒకే గొప్ప కల ఉంది, అది తమిళ జాతీయవాద విజయం. దానిని ప్రజలకు చేరవేయడం అనే గొప్ప లక్ష్యం, మరియు ఆ లక్ష్యాన్ని సాధించే ప్రయాణంలో నేను ఒక భాగమైనందుకు గర్వపడుతున్నాను. కానీ ఈ ప్రయాణం ఇంత త్వరగా ముగుస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు. గత 6 సంవత్సరాలుగా, నేను ఈ మైదానంలో నిలబడి, మీ అందరి ప్రేమ మరియు నమ్మకంతో, నా



సామర్థ్యానికి మించి, సామాజిక మార్పు కోసం ఒక మహిళగా నేను చేయగలిగినంత పోరాడుతున్నాను. అయితే, కాలపు పరిస్థితులను మన జీవితంగా పరిగణించి, తమిళ పార్టీ అయిన మనం తీసుకున్న మార్గం ముగిసిపోతోందని నేను చాలా విచారంగా మరియు బరువెక్కిన హృదయంతో ప్రకటిస్తున్నానని పేర్కొన్నారు.